# శ్రీ కృష్ణయ్య స్వామి - ప్రొద్దుటూరు

సేకరణ : శ్రీపెసల సుబ్బరామయ్య

# శ్రీ కృష్ణయ్య స్వామి - ప్రొద్దుటూరు

## ముందు మాట

ఈ మహనీయుని గురించి దివ్యానుభవములు పొందినవారు తమ అనుభవాలు ఇతరులకు చెప్పేందుకు భయపడుచున్నారు. వారి గొప్పదనం తెలియనివారు పెట్టే నమస్కారానికి, వారి దివ్య మహిమ తెలిసిపెట్టే నమస్కారానికి ఎంతో భేదముంటుంది. ప్రతివారు ఆ మహనీయుని దర్శించి గొప్ప పుణ్యం పొందాలనేదే శ్రీ సాయి మాష్టర్ సేవా ట్రస్టు, గొలగమూడి వారి ఉద్దేశ్యము. శ్రీ వెంకయ్య స్వామి, గొలగమూడి వారు మన మధ్య ఉండగానే వారిని గురించి పది వేల పుస్తకములలో ప్రచురించి, శ్రీ మాష్టరుగారు కొన్ని వేలమందికి వారి దర్శనభాగ్యము కలిగించారు. గనుక దివ్యానుభవాలు పొందిన భక్తులు మీ అనుభవాలు కాగితంపై వ్రాయించి సంతకము, మీ అడ్రసుతో శ్రీ సాయి మాష్టర్ సేవా ట్రస్టు, గొలగమూడి, నెల్లూరు జిల్లా 524 321 వారికి పంప మనవి. మనము పొందిన గొప్పమేలు పదిమందికి చెప్పి శ్రీస్వామి వారి అవతారకార్యమునకు ఉడతా భక్తిగా సహకరించడం మన ధర్మము.

నమస్కారములతో
శ్రీ సాయి మాష్టర్ సేవా ట్రస్టు,
గొలగమూడి, నెల్లూరు జిల్లా 524 321

# శ్రీ కృష్ణయ్య స్వామి - ప్రొద్దుటూరు

ఈ మహనీయునికి ఇసుక స్వామి అనే పేరు కూడా ఉంది. కారణం వీరు ఇసుకనే ఆహారముగా తింటుంటారు. ప్రొద్దుటూరంతా వీరంటే తెలియనివారే లేరు. వీరెక్కిన కారు, బస్సు, లారీ, ఆటో ఎంత దూరము ప్రయాణం చేసినా ఒక్క బొట్టు ఆయిల్ ఖర్చు కాదు. ఆ గ్రామంలో ప్రతి వ్యక్తికీ వీరంటే ఎంతో పూజ్య భావముంది. వారెప్పుడూ అతీతస్థితిలోనే ఉంటారు. ఒకప్పుడు భక్తులర్పించిన దుస్తులు ధరిస్తారు. ఒకప్పుడు పూర్తి దిగంబరులుగా ఉంటారు. వారిని దర్శించిన ప్రతి ఒక్కరి సర్వ విషయాలేగాక, అనుక్షణము వారి మనసులోని సర్వయోచనలు వీరికి తెలుస్తుండడమేకాక, ఆయా ఆలోచనలకు సరైన సమాధానాలిస్తుంటారు. మహనీయుల చరిత్ర పారాయణ, నామస్మరణ చేసుకొనే భక్తులకు ప్రత్యేకమైన వీరి ఆశీస్సులు లభిస్తున్నాయి. ఇప్పుడు కొందరు భక్తుల అనుభవాలు చూస్తాము.

మోపూరు వెంకట లక్షమ్మ, **APSWR** స్కూల్, రామాపురం, కడప వారు శ్రీ స్వామి వారి లీల ఈ క్రింది విధంగా తెలిపారు.

**1980** సం. కాలంలో ప్రొద్దుటూరులోని వర్తకులు కొందరు శ్రీ కృష్ణయ్య స్వామిని లారీలో ఎక్కించుకొని హైదరాబాద్‌కు తీసుకొని వెళ్ళారు. అక్కడ స్వామిని వదిలి స్వామి మహిమను పరీక్షించాలని తిరిగి ఎక్కించుకు రాకుండా వచ్చేశారు. కాని ఇక్కడికి వచ్చి (ప్రొద్దుటూరు) విచారించితే వారు హైదరాబాదులో స్వామిని వదలిన సమయములోనే స్వామి ప్రొద్దుటూరులో కూడా ఉన్నట్లు తెలిసింది.



మోపూరు ప్రసన్నలక్ష్మి, **16-4-854**, శ్రామికనగర్, నెల్లూరు**-4.** ఇలా చెపుతుంది.

ప్రొద్దుటూరులో శ్రీ కృష్ణయ్యస్వామి అనే అవధూత వున్నారని తెలిసిన తరువాత వారిని దర్శించడానికి నేను కడపనుండి మా అమ్మ వాళ్ళింటికి వెళ్ళినప్పుడు, వెళ్ళి వచ్చేదానిని.

ఇంట్లో శ్రీసాయిలీలామృతము పారాయణ చేసుకుంటుంటే కలలో ఒకసారి శ్రీస్వామివారు కన్పించారు. కాసేపు వారి దగ్గర కూర్చున్నాక స్వామి లేచి వెళ్ళబోయారు, నేను 'స్వామీ అన్నాను' ఏమిటి? అన్నారు. 'నాకు ఒక చిన్న ఉద్యోగము ఇప్పించండి' అన్నాను. 'అయితే ఇన్ని రోజులు ఎందుకడగలేదు. నాలుగు గురువారాలు వడలు పెట్టు' అన్నారు. నేను తరువాత నాలుగు గురువారాలు సాయి పటానికి వడలు ప్రసాదంగా పెట్టాను. తరువాత మా ఇంటి దగ్గరున్న స్కూలులోనే నాకు విద్యావాలంటీరుగా ఉద్యోగము వచ్చింది.

శ్రీ సుంకు సుబ్బారావు, **Door No. 3-1125, YMR** కాలనీ, ప్రొద్దుటూరు శ్రీ స్వామి వారి భక్తుల అనుభవాలు ఇలా చెప్పారు.

శ్రీ స్వామి మీద విశ్వాసం ఉంచితే కలిగే ఫలితం గురించి చెబుతూ - ఒకామె ప్రొద్దుటూరులో **LIC** లో ఉద్యోగము చేస్తూ ఉండేది. వాళ్ళ అమ్మ ఒకసారి కూతురు వద్దకు జమ్మలమడుగు వచ్చింది. అక్కడ ఎవరో శ్రీ స్వామి గురించి చెపుతూ ఉంటే విని ప్రొద్దుటూరు వెళ్ళి శ్రీ స్వామిని దర్శించింది. వారు ఎంతో గొప్ప మహాత్ములని గుర్తించి కూతురుతో చెబితే కూతురు వెళ్ళి శ్రీస్వామి వారిని దర్శించింది. ఈమెకు పెళ్ళి కాలేదు. ఈమె రోజూ ఉదయం 5 గంటలకు శ్రీస్వామి దగ్గరకు వెళ్ళేది. శ్రీస్వామి 5 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్ళేవారు. శ్రీస్వామి వారు బయటకు వెళ్ళేముందే శ్రీస్వామి వద్దకు

వెళ్ళి శ్రీస్వామి ఎటువెళితే అటు తాను డ్యూటి టైమ్ వరకు అనుసరించేది. ఒకరోజు శ్రీస్వామి ఈమె డ్యూటి టైము అయినా పంపించలేదు. అప్పుడు ఈమె మనస్సులో టెన్షన్‌గా ఫీలు అవుతుంటే శ్రీస్వామి వెళ్ళి **RTC** బస్సు తెచ్చి ఈ అమ్మాయిని వేరు నలుగురు భక్తులను ఎక్కించుకొని రెండు, మూడు గ్రామాలు దాటి ఒకచోట ఆపి దిగిపో అన్నారు ఆమెను. అందరూ ఆశ్చర్యపోయారు. కనీసం ప్రక్కవాళ్ళకు కూడా తెలియదు ఆమె ఆ ఆఫీసులో పనిచేస్తుందని. శ్రీస్వామి ఆమెకు టెన్షన్ పోగొట్టి ఆమెను కరెక్టు టైమ్‌కి ఆఫీసులో హాజరు పరిచారు.

తరువాత ఈమెకు వాళ్ళమేనత్త కొడుకుతో వివాహము అవ్వాలని శ్రీస్వామి వారిని కోరుకుంది. కాని వాళ్ళ ఇంటిలో వాళ్ళకు ఇష్టంలేదు. శ్రీస్వామి వారి అనుగ్రహంతో వివాహం అయ్యింది. ఈమె జమ్మలమడుగులో, ఆమె భర్త హైదరబాద్‌లో ఇంజనీర్‌గా ఉద్యోగం వేరు వేరు చోట్ల చేస్తున్నారు. కాబట్టి శ్రీస్వామి వారిని ఇద్దరిని ఒకేచోటుకు చేర్చమని ప్రార్థించారు. ఇద్దరికి సిద్ధిపేటకు ట్రాన్సఫర్‌అయి ఒకేచోటుకు చేరారు. ఈవిధంగా వాళ్ళ కోరిక తీర్చారు. తరువాత అబ్బాయి పుట్టాలని కోరుకుంటే అబ్బాయి పుట్టాడు. వాళ్ళ బాబుకి 4వ సంవత్సరము వచ్చాక శ్రీశైలం ఘాట్‌రోడ్డులో వెళ్ళుతూ ఉంటే వీరు ప్రయాణము చేస్తున్న వ్యాన్‌ను ట్రాక్టర్ ఢీ కొన్నది. దానితో వ్యాన్ ముక్కలుగా అయ్యిపోయింది. ఎవరికి దెబ్బలు తగలలేదు. 4 సంవత్సరాల బాబుకి మాత్రం తలమీద రెండు అంగుళాల బెజ్జం పడి గ్లాసుడు రక్తం కారింది. ఆసుపత్రికి తీసుకు వెళ్ళి ట్రీట్‌మెంట్ చేయించారు. తెల్లవారి పెద్ద ఆసుపత్రికి తీసుకు వెళదామని రాత్రి శ్రీస్వామివారిని తలచుకొని నిద్రపోయారు. తెల్లవారి లేచి ఆ గాయమును చూచి వారు ఆశ్చర్యపోయారు. కారణం అది పూర్తిగా మాడిపోయినది. ఎంత చిత్రం శ్రీస్వామివారిని తలుచుకుంటేనే



ఆగాయం మానడము శ్రీస్వామివారి కృప మరియు అద్భుతలీల. ఈమె కృతజ్ఞతతో ప్రొద్దుటూరుకి వచ్చి శ్రీస్వామివారికి వస్త్రములు పెట్టి ఈ అనుభవం చెప్పింది. ఈమె నెలకు ఒకమారు వచ్చి శ్రీస్వామివారిని దర్శిస్తుంది.

ఒక పోలీస్ **SI** గారి అనుభవము.

శ్రీస్వామివారు ఒక భక్తుని ఇంట వద్ద ఉండేవారు. ఆ భక్తుని, పోలీసులు ఒక అభియోగంపై పోలీసు స్టేషన్‌కు తీసుకు వెళ్ళారు. నేను చేయలేదన్నా పోలీసులు వినటంలేదు. శ్రీస్వామివారు స్టేషన్‌కు వెళ్ళి ఆ భక్తునితో పోదాంరా అని తీసుకు వెళ్ళబోయారు. ఆ భక్తుడు వెంటనే శ్రీస్వామివారిని అనుసరించాడు. వెంటనే పోలీసువారు అడ్డు చెప్పి మాధర్మం అనుసరించి మేము అతన్ని తీసుకు వచ్చాము. అతన్ని ఇక్కడ నుండి తీసుకు వెళ్ళటానికి, మీరు ఎవరని? శ్రీస్వామివారిని ప్రశ్నించారు. శ్రీస్వామివారు మారు మాట్లాడక భక్తుని వదలి వెళ్ళి, మరల మరు రోజు వచ్చి భక్తుని తీసుకుని వెళ్ళబోగా, మరల పోలీసువారితో అదే సంభాషణ జరిగింది. ఈ విధంగా రెండు, మూడు రోజులు జరిగింది. ఈ సమయంలో ఆ భక్తుడు శ్రీస్వామివారి లీలను చెప్పుతూ, నేను నిరపరాధినని మీకు తెలియకున్నను సర్వ సమర్థులైన శ్రీస్వామివారికి తెలుసుకదా! ఆయన చెప్పిన ప్రకారమైనను నన్ను విడచి పెట్టవచ్చుకదా అని చెప్పుచూ ఉదాహరణగా ఆయన ఇసుకను సైతం ఆహారంగా తింటారు అని చెప్పి కావాలంటే మీరు నిరూపించు కోవచ్చని చెప్పెను. యథాప్రకారం మరుసటి రోజు శ్రీస్వామివారు రాగా భక్తుడు, స్వామి ఆ పోలీసు నన్ను పంపనంటున్నాడు. మీ లీలను చెప్పాను. మీరు ఇసుకను సైతం ఆహారంగా తినగలరని చెప్పిన దానిని అతను నిరూపించుకోదలచాడు అని చెప్పగా శ్రీస్వామివారు ఇసుకను తెప్పించమనగా ఆ యస్.ఐ బాల్చాలతో ఇసుకను తెప్పించుచుండగా

శ్రీస్వామివారు మొత్తము ఇసుకను తినివేస్తున్నారు. ఇది చూచిన భక్తుడు ఆ యస్.ఐతో శ్రీస్వామివారి శక్తి అర్థమైనది కదా! ఇప్పటికైననూ ఆపించండి లేకున్న దాని ఫలితాన్ని మీరు అనుభవించ వలసి వస్తుంది అని చెప్పాడు. శ్రీస్వామి యొక్క సర్వ సమర్థతను కన్నులారా గాంచిన ఆ యస్.ఐ వెంటనే శ్రీస్వామివారి పాదాలపై పడి క్షమించమని కోరి, ఆ జైలులో పెట్టిన భక్తుని విడిపించి తాను కూడా పరమ భక్తుడైనాడు.

శ్రీమతి **K.** నాగ భాసురాదేవి , కలిచేడు గ్రామం. రిటైర్డ్ టీచర్‌గారి అనుభవం.

మేము **5** మందిమి శ్రీకృష్ణయ్యస్వామి, ప్రొద్దుటూరు వారి దర్శనార్థం వెళ్ళాము. మా స్నేహితుల ఇంట్లో సంచులు పెట్టాము. శ్రీస్వామివారు మా అందరికీ పైపుతో నీరు పట్టి తడిపేశారు. అది గొప్ప అనుగ్రహమని సంతోషించాము. ఒక లారీ వస్తుంటే నిలిపి నలుగురిని లారీ బాడీలోను ఒక్కరిని తన ప్రక్కన క్యాబిన్‌లో కూర్చోబెట్టుకుని లారీని పోనీయమని ఎంతోసేపు ఎక్కడెక్కడో త్రిప్పారు. చివరకు ఒక నూనెమిల్లు దగ్గర లారీ ఆపి అక్కడున్న పెద్ద గంపతో శెనక్కాయ పొట్టు తెచ్చి లారీ డ్రైవర్ ముందు బ్రేకులు మునిగినంతవరకు వారే పోశారు. లారీని తిరిగి పోనిమన్నారు. ఈ మహనీయుని సంగతి తెలిసిన ఆ డ్రైవరు లారీ నడుపు తున్నాడు. ఎంత దూరమో ప్రొద్దుటూరంతా త్రిప్పుచున్నాడు. మాకు యూరినల్స్ పోవలసిన అవసరం వచ్చింది. శ్రీస్వామివారిని అడిగి లారి ఆపించలేక డ్రైవరకు చెప్పలేక యూరినేషన్ ఆపుకోలేక చాలా సతమతమై పోతున్నాము. పొట్ట ఉబ్బిపోతుంది. మేము శ్రీస్వామివారికి చెప్పకుండానే వారొక ఇంటి ముందు లారీ ఆపించి వెళ్ళిరండి అని లారీ దింపేశారు. ఆ ఇంట్లో ఎదురుగుండా బాత్‌రూము లెట్రిన్ కనబడు తున్నాయి. బ్రతుకు జీవుడా అంటూ అవసరం తీర్చుకొని వచ్చాము.



మరలా లారీ ఎక్కించి మరలా త్రిప్పుతున్నారు. ప్రొద్దుటూరు మాకు క్రొత్త. మా స్నేహితుల ఇల్లు ఉండే ఏరియా పేరు, ఇంటి నెంబరు, వార్డు నెంబరు తెలియదు. వాళ్ళింటికి పోవడం ఎట్లాగా అని మదనపడి మనస్సులో చచ్చినంత పనిగా భయమేస్తుంది. మా ఆలోచనలు ఎరిగిన సర్వజ్ఞమూర్తిగదా శ్రీస్వామివారు, ఉన్నట్లుండి ఒక ఇంటి ముందు లారీ ఆపి ఇక దిగి పోండి అని అన్నారు. దిగి చూస్తే అదే మాస్నేహితుల ఇల్లు. మనతో వుంటూనే పిచ్చిగా నటిస్తూనే మన ఆలోచనలన్నీ తెలుసుకుంటూ మన అవసరాలు మనం అడగకనే తీర్చే కరుణామూర్తి శ్రీస్వామివారు.

వారి దర్శనానికి వెళ్ళేవారు, శ్రీ గురుచరిత్ర, శ్రీ సాయి చరిత్ర, శ్రీ వెంకయ్యస్వామి చరిత్రలాంటి మహనీయుల చరిత్ర పారాయణ చేసిపోవడం, మార్గాన నామస్మరణ చేస్తూ అన్యచింతలకు తావివ్వకుంటే అద్భుతంగా వారి అనుగ్రహాన్ని పొందగలము. చివటం అమ్మ చెప్పినట్లు, నీకు రావడమైవా వచ్చిందటే అన్న మాట గుర్తుంచుకోవాలి.

ఒక భక్తుని అనుభవాలు – శ్రీస్వామివారితో మొదటి పరిచయము.

శ్రీస్వామివారు ఊళ్ళో పిచ్చిగా తిరుగుతుండేవారు. ఒకసారి ఈయన శ్రీస్వామివారి దగ్గరకు వెళితే శ్రీస్వామివారు కర్రతో కొట్టారు. వీపుమీద కొట్టినా వాతపడలేదు. పైగా అప్పటినుండి హాయిగా, ఉల్లాసంగా ఉన్నాడు. ఈ మార్పు స్వామి దయవలన (అంటే కొట్టడం) అని గమనించి భార్యకి చెపుతాడు. అప్పటునుంచి వాళ్ళు శ్రీస్వామివారిని తరుచుగా దర్శించుకొంటున్నారు. వాళ్ళ ఆర్థిక పరిస్థితి కూడా క్రమంగా అభివృద్ధి చెందుతుంది.

ఈయన బావమరిదికి పెండ్లి నిశ్చయం.

ఈయన బావమరిదికి వయస్సు మీరినా వివాహము కాలేదు. ఈయనకి శ్రీస్వామివారి గూర్చి చెప్పి శ్రీస్వామివారి దగ్గరకు బావమరిదిని తీసుకెళ్ళిన వారం రోజుల్లోనే ఆయనకు (బావమరిదికి) వివాహమయినది.

ఈయన బావమరిదిని మృత్యువు నుండి రక్షించుట.

పెండ్లి అయిన 7 నెలల తరువాత బావమరిదికి ఆరోగ్యం సరిగా లేదు. కడుపులోనొప్పి వచ్చింది. ఒక డాక్టరుకి చూపిస్తే ఆపరేషన్ చేయాలని ఆపరేషన్ చేసారు. కానీ ఆపరేషన్ ఫైయిల్ అయింది. కడుపులో చీము, నెత్తురు వస్తువుంటే మళ్ళీ ఆపరేషన్ చేసారు. మళ్ళీ ఆపరేషన్ ఫైయిల్ అయింది. దాదాపు 20 వేల రూపాయలు ఖర్చయింది. ఈ డాక్టరే వీరిని తీసుకెళ్ళి యింకో డాక్టరుకి చూపించారు. ఆయన నావల్ల కాదు తీసుకెళ్ళమన్నారు. బావమరిది కోమాలోకి వెళ్ళారు. వీళ్ళక్క యింటి దగ్గర శ్రీస్వామివారి ఫోటో ముందు కూర్చొని, స్వామీ! నీ దయవల్లే యితడికి వివాహమైంది. మీరే యిప్పుడు యితడ్ని ఆరోగ్యవంతుడ్ని చేయాలని రోజూ మొరపెట్టుకొనేది. బావకి ఆ రాత్రి స్వప్నంలో శ్రీస్వామివారు కనిపించారు. కలలో యమభటులు యితడ్ని తీసికెళ్ళే ప్రయత్నం చేస్తున్నారు. శ్రీ కృష్ణయ్య స్వామి వాళ్ళ ప్రక్కనే వున్నారు. శ్రీస్వామివారు ఎక్కడికిరా తీసుకెళ్ళేది తీసుకెళ్ళండి చూస్తాను అని అన్నారు. అతడ్ని తీసుకెళ్ళలేక యమభటులు వెళ్ళిపోయారు. ఆ మర్నాటి నుండి చక్కగా ఆర్యోగవంతుడయ్యాడు. ఆ రకంగా శ్రీస్వామివారు అతడ్ని మృత్య ముఖం నుండి రక్షించారు.



శ్రీ సుంకు సుబ్బారావు గారు శ్రీస్వామివారి భక్తుడు. వీరింటికి శ్రీస్వామివారు రోజూ వచ్చి ఏదో వేళలో భోజనం చేసి వెళుతారు. ఒక రోజు వీరింటికి ఒక రమణ మహర్షి భక్తడు వచ్చారు. ఆ సమయంలో సుబ్బారావు గారు పూజ చేసుకుంటున్నారు. ఆ భక్తుడు రమణమహర్షి పుస్తకం ఒకచోట పెట్టి వెళ్ళారు. శ్రీస్వామివారు సాయంత్రం సుబ్బారావు గారింటికి వచ్చి ఆ పుస్తకంలో అరుణాచలం గిరి ప్రదక్షిణ మ్యాప్ గీచి అక్కడే పెట్టేసి వెళ్ళారు. శ్రీస్వామివారు పుస్తకము తీసుకొన్నది, అందులో మ్యాప్ గీయడం, అసలు ఆ భక్తుడు పుస్తకము అక్కడ పెట్టినట్లు కూడా తెలియదు.

సాయంత్రము ఆ రమణ మహర్షి భక్తుడు వచ్చి ఆ పుస్తకము తీసుకొని, దాంట్లో గీచిన మ్యాప్ చూసి ఆశ్చర్యపోయాడు. కారణం శ్రీస్వామివారు నిజంగా మహాత్ముడైతే అరుణాచలం మ్యాప్ గీయాలని మనస్సులో అనుకున్నాడు. అది శ్రీస్వామివారు గ్రహించి మ్యాప్ గీసారు.

శ్రీమతి నాగలక్ష్మిగారు ప్రొద్దుటూరు, శ్రీస్వామివారిని గురించి యిలా చెపుతున్నారు.

శ్రీస్వామివారి నాన్నగారు సాధువని, శ్రీస్వామివారు చిన్నప్పటి నుంచే దిగంబరముగా తిరుగుతుండేవారు, ఊరి బయటకు వెళ్ళి ఇసుక తింటూవుండేవారట. వీళ్ళందరూ కూలీ పనికి వెళ్ళి వస్తూ శ్రీస్వామివారిని చూచి 'కిట్టయ్యా ఇసుక తింటున్నావా మీ అమ్మకు చెపుతాంలే' అంటే శ్రీస్వామివారు వీరిని రాళ్ళతో కొడుతూ వెంటబడేవారు. (మహాభారతంలోని చిన్ని కృష్ణుడే శ్రీస్వామివారని ఈ చిన్న సంఘటన ద్వారా తెలుస్తుంది)

2001 సంవత్సరము జూన్ నెలలో మాతమ్మునికి కొడుకు పుట్టాడు. పుట్టిన వారం రోజుల తర్వాత నుండి ఫిట్స్ కనిపిస్తున్నాయి. కారణం డాక్టర్లకు కూడా అంతుబట్ట లేదు. కడపలో సుమారు 5 వేల రూపాయలు ఖర్చయింది. తరునాత ప్రొద్దుటూరు తీసుకొచ్చాము. ఇక్కడా పెద్ద డాక్టర్లిద్దరికి చూపించాము. ఫిట్స్ రోజుకు 4, 5 సార్లు కన్పించేవి. ఈ విధంగా ఫిట్స్‌వస్తే మెదడులో నరాలు చిట్లిపోతాయని చెప్పి కర్నూలు స్పెషలిస్ట్స్ వద్దకు తీసుకెళ్ళమన్నారు. మాపుట్టింటిలోను, మాకు ఎవ్వరికీ శాంతి లేదు. ఆ చిన్న పసికందును తీసుకుని శ్రీస్వామివారి దగ్గరికి వెళ్ళాము. దూరంనుండే మమ్ములను చూసి శ్రీస్వామివారు తిడుతుండటం మేము చూసి, దగ్గరికి వెళ్ళి విషయము చెప్పాము. శ్రీస్వామివారు బాగుంటుంది పో... అన్నారు. అక్కడున్న సేవకులు శ్రీస్వామివారు ఎంగిలి చేసిన నీళ్ళు కవరులో పోసి యిచ్చారు. వాటిని తీసుకెళ్ళి ఒక బాటిల్‌లోపోసి చుక్క చుక్క పిల్లవానికి ఇవ్వసాగాము. తెల్లవారి బిడ్డను కర్నూలు తీసుకు పోయారు. ఆ ముందటి రోజు రాత్రి నాకు కలలో శ్రీస్వామివారు డాక్టరుగా దర్శనమిచ్చి, 'బిడ్డకు మందయ్యమంటివే, నాకేమన్నా ఇవ్వు' అంటూ నా చెయ్యి పట్టుకుని లాగుతున్నారు. నిద్రలేచి ప్రక్కనే వున్న మా అక్కకు చెప్పాను. తెల్లవారక ముందే 5 టెంకాయలు తీసుకుని శ్రీస్వామివారి ఎదుట వుంచి నమస్కరించుకొని వచ్చాము. తరువాత 3 రోజులకి కర్నూలు నుండి మా అమ్మవాళ్ళు వచ్చారు. అక్కడ అన్ని పరీక్షలు (మెదడు మరియు వెన్నుపూస నుండి లిక్విడ్‌లు పరీక్షలు) చేసి ఎటువంటి ప్రాబ్లము లేదని చెప్పారు. బాబుకు ప్రాణగండము, కేవలం శ్రీస్వామివారి కృప వలనే తప్పింది. 6 రోజుల తరువాత కూడా మేము దర్శనానికి వెళ్ళినప్పుడు సేవకులు 'శ్రీస్వామివారు సాధారణంగా ఎవ్వరేమిచ్చిన లోపల వుంచనివ్వరు. కానీ మీరిచ్చిన టెంకాయలు ఆ రోజునుండి లోపలే వున్నాయి'అన్నారు. శ్రీస్వామివారికి ఏమిచ్చి మేము ఋణం తీర్చుకోగలం.



శ్రీ రమేష్‌బాబు, ఇన్సపెక్టరు, కస్టమ్స్ అండ్ సెంట్రల్ ఎక్సైజ్ డిపార్టమెంట్, ప్రొద్దుటూరు.

శ్రీ కృష్ణయ్యస్వామి వారు తరచూ మా ఎదురింటి శ్రీ సుంకు సుబ్బారావు గారి యింటికి వస్తూపోతూ వుండేవారు. జూన్ 1998 లో మా తల్లి, తండ్రులు కాశి యాత్ర చేసి వచ్చారు. ఆ మరుసటి దినం బైరవపూజ ఇంట్లో జరుగుతుంది. ఆ రోజు ఎందుకనో శ్రీ కృష్ణయ్య స్వామి వారికి భోజనం పెట్టాలని అనిపించింది. అప్పటి వరకూ శ్రీస్వామివారికి దూరం నుండే నమస్కరించు కొనేవాడ్ని గాని దగ్గరకు వెళ్ళి పాదనమస్కారము చేసుకొన్నదే లేదు. దగ్గరకు వెళ్ళేందుకు భయంగా వుండేది. కాని ఆ రోజు శ్రీస్వామివారికి భోజనం పెట్టాలని ప్రేరణ కలిగింది. శ్రీ సుబ్బారావు యింటి గేటు వద్ద శ్రీస్వామివారితో వుంటున్న ఒకరితో, 'అయ్యా! ఈరోజు శ్రీస్వామివారికి భోజనం పెట్టాలని అనుకుంటున్నాను, పెట్టవచ్చా?' అని అడుగుతున్నాను. లోపలనుంచి శ్రీస్వామివారు 'పో పో పొమ్మను' అని గట్టిగా అరిచారు. అక్కడ వున్న వాళ్ళు కూడా పోండి, స్వామి కోపంగా వున్నారు అన్నారు. కొంచెం విచారంగా యింటికి వచ్చి అరుగు మీద కూర్చొని మనస్సులో ఇలా అనుకొన్నాను.

'నేను వారికి భోజనం పెట్టాలనుకుంటే వారు తరిమేసారు'. ఈయన కూడ బాబాగారిలాగా స్వామి అయితే నేను ఇక్కడ కూర్చొని 'ఓం సాయి శ్రీ సాయి జయ జయ సాయి' అని మనస్సులో 108 సార్లు చెప్పుకుంటాను. వారంతట వారే అడిగి భోజనం తీసుకోవాలి అని అనుకొని ఆ నామం తలుస్తున్నాను. 40 సార్లు ఆ నామం తలచుకొన్న వెంటనే, సుబ్బారావు గారి ఇంటి గేట్ దగ్గర వున్నవాళ్ళు 'బాబు త్వరగా భోజనం తీసుకరా, స్వామి అడుగుతున్నారు' అని వినపడింది. ఆనందంతో ఒక్కసారిగా లేచి ఇంట్లోకి వెళ్ళి భోజనం పెట్టుకొని

శ్రీస్వామివారికి ఇచ్చి నమస్కారం చేసుకొన్నాను. నాకు చాలా సంతోషమయింది. అందుకు రెండు కారణాలున్నాయి. ఒకటి శ్రీస్వామివారికి భోజనం పెట్టగలిగినందుకు, రెండు శ్రీస్వామివారు గొప్ప అవధూతయేగాని పిచ్చివాడు కాదు అని బాబాగారు ఋజువు ఇచ్చినందుకు. అంతే కాకుండ ఆ రోజు శ్రీస్వామివారు నాకు తెలియకుండానే ఒక గొప్ప వరాన్ని ప్రసాదించారు. అది 'ఓం సాయి శ్రీ సాయి జయ జయ సాయి' అని నేను శ్రీ సాయి నామస్మరణ నిరంతరము చేసుకొనేలా, ఆ నామస్మరణ నా ప్రయత్నం లేకనే నాలో జరిగేలా ఆశీర్వదించారు.

ఈ నామస్మరణ ప్రభావమో లేక శ్రీస్వామివారి ఆశీర్వాదమో తెలియదు కాని తర్వాత నాకు దత్తావధూత శ్రీశ్రీశ్రీ శివానంద మహరాజ్ గారి దర్శనము, స్పర్శనము, సంభాషణము, సేవించుకొనే భాగ్యము కలిగినది. వారిని సేవించుకొన్న తరువాతనే శ్రీస్వామివారిని సంపూర్ణ దత్తావతారంగా, దత్తావధూతగా తెలుసుకుని నమస్కరించు కున్నది. అందరి మహనీయులలో, అవధూతలలో సంచరించేది, వారి నుండి ప్రకటమయ్యేది సద్గురుమూర్తి అయిన శ్రీ దత్తాత్రేయుల వారేనని తెలుసుకొని ఆ భావంతోటే శ్రీ కృష్ణయ్యస్వామి గారిని సేవించు కొంటున్నాను.

నాకు తరుచూ శ్రీశ్రీశ్రీ శివానంద మహరాజ్ గారు స్వప్న దర్శనం ఇస్తూవుంటారు. అలాగే 4, 5 సార్లు శ్రీ కృష్ణయ్య స్వామి వారు కూడ స్వప్న దర్శనమిచ్చారు. ఒక రోజు నేను ఇంకో నలుగురితోపాటు ప్రయాణం చేస్తున్న టాటా సియారా ఆక్సిడెంట్ అయి 6 పల్టీలు కొట్టి రోడ్డు ప్రక్కన తలక్రిందులుగా పడింది. అందరికి కాళ్ళు చేతులు విరిగాయి కాని నాకు మాత్రము పాదం మీద చిన్నగాయం మాత్రమే అయింది. అది బాబా మరియు శివానంద మహరాజ్‌గారి కృపగా



భావించి సంతోషించాను. అదే రోజు రాత్రి శ్రీ కృష్ణయ్య స్వామి వారు స్వప్న దర్శనమిచ్చి నన్ను బోర్ల పడుకో పెట్టుకొని వీపు మీద చిన్నకర్రతో జోల పాడుతున్నట్లుగా కొడుతూ వున్నారు. అపుడు నాకు శిరిడీ సాయిబాబా గారు, స్వామి శివానంద మహరాజ్ గారిలాగా శ్రీ కృష్ణయ్య స్వామి వారి రక్షణ కూడ నాకు వున్నది అని తెలుసుకొని చాలా సంతోష పడ్డాను. ఈ మహాత్ముల దర్శన, స్పర్శన, సంభాషణ, సేవాభాగ్యం ఏ జన్మ పుణ్యమో. సద్గురు నామస్మరణ, పాదసేవ సదా నాకు ప్రసాదించమని శ్రీ దత్తుని వేడుకుంటున్నాను.

రాజుగారు, టీచర్, ఉదయగిరి

నేను మా బంధువు సరస్వతి చలమరాజు శ్రీస్వామివారి దర్శనానికి వెళ్ళి ఉదయము నుంచి మధ్యాహ్నము వరకూ శ్రీస్వామివారి కోసం వెదికితిమి. దాదాపు ప్రొద్దుటూరంతా తిరిగాము. బాగా అలసి పోయాము. ఇక లాభము లేదనుకొని హోటల్లో భోజనం చేసి తిరిగి వెళ్ళిపోదామని ఒక చెట్టు క్రింద అలసట తీర్చుకొనుటకు నిలబడ్డాము. 5 నిమషాలలో మా యిద్దరి సంభాషణ విని ప్రక్కనే వున్న రిక్షావాలా మా వద్దకు వచ్చి 'సార్! శ్రీ స్వామివారు ఎక్కడ తిరిగినా ప్రతి రోజు సాయంత్రము ఒక యింటి దగ్గరకు వస్తారు, మీరు ఆయనను వెతికి పట్టుకోవాలంటే చాలా కష్టము. అందువలన మీరు అక్కడ వుంటే ఆయన దర్శనము రాత్రికి ఖచ్చితంగా పొందవచ్చుగదా!' అన్నారు. భగవంతుడు మా మొరాలకించాడని సంతోషించి అదే రిక్షాలో ఆ యింటి వద్ద దిగాము.(శివాలయం సెంటర్, పూలమార్కెట్టు సందు, విష్ణు ప్రింటర్స్ ప్రక్కన కాలువకట్ట సంజమ్మ యిల్లు) సాయంత్రము 6 గంటల ప్రాంతములో శ్రీస్వామివారు రిక్షాలో వచ్చారు. ఆజానుబాహుడు పెద్ద పొట్ట, పుట్టగోచి మాత్రమే పెట్టుకొని నల్లటి స్వరూపంతో తలకు రిబ్బను కట్టుకొని పచ్చి రౌడీ మాదిరో లేక దొంగ మాదిరో స్వరూపమున్నదిగాని ఆయన మహాత్ముడని సాక్షాత్తు శివాంశ

అని ఏ కోశాన అనిపించదు. ఆ యింటి ఆమె మమ్ములను కూర్చోమని చెప్పి మంచం వేసింది. (టీచర్లంగదా సాయంత్రము వరకూ నిల్చొని ఎలా వుంటారనే వుద్దేశ్యంతో) శ్రీస్వామివారు రిక్షా దిగిన వెంటనే 'నా మంచం మీద మీరు కూర్చుంటారటరా' అని వుగ్రరూపం దాల్చి స్పీడుగా వచ్చి మంచం ఎత్తి ముల్లు గర్ర తీసుకొని మామీదకు వచ్చారు. మేము భయంతో దూరంగా పరిగెత్తాము. మేము తీసుకు పోయిన పూలు, పండ్లు బైట విసరి వేసారు. ఆ రోజు ఆయన సన్నిధికి పోవడానికి ఎన్ని సార్లు ప్రయత్నించేసినా ఆయన దగ్గరకు రానివ్వలేదు. ఆ రోజు రాత్రి అక్కడవుండి ఉదయాన్నే యింటి ముఖం పట్టాము.

అంతటితో మా బంధువు యిక జన్మలో శ్రీస్వామివారి దర్శనానికి రానన్నాడు. నేను మరియొక సారి యింట్లో గొడవలతో విసిగి శ్రీస్వామివారి దర్శనానికి వెళ్ళాను. ఆ రోజు సాయంత్రము చర్నకోలతో 6 దెబ్బలు నన్ను కొట్టారు. ఒక్కొక్క దెబ్బకు నా మనస్సు చల్లగా ప్రశాంతమవుతున్నది. శరీరం మీద మాత్రం కొంచెం చురుకు అనిపిస్తూవున్నది. 6 దెబ్బల తరువాత ప్రక్కన చూస్తున్నవాళ్ళకు కళ్ళ నీళ్ళు వచ్చాయి. నా వీపు రక్తసిక్త మయినదని అనుకున్నారు. నాకేమీ మీరనుకున్నట్లు కాలేదని నేను చెప్పినా వినలేదు. చొక్కా విప్పమన్నారు. విప్పి చూపించాను. ఒక్క వాత గూడ వీపున పడలేదు. ఆశ్చర్యపోవడం ప్రక్కవాళ్ళ వంతు అయింది.

మరునాడు ఉదయాన్నే 5 గంటలకు వెళ్ళాను. నాచేత బనియను, పంచె తెప్పించారు. రెండూ ధరించారు. అర్ధ గంటసేపు నాట్యం చేశారు. బనియను చింపేశారు. పంచెవూడదీసి నా ముఖాన కొట్టి 'పోరా! పో!' అన్నారు. అచ్చటి ఆయన శిష్యులు అది గొప్ప ఆశీర్వచనమని ఆ పంచె తీసుకపోయి పూజలో పెట్టుకొనమని చెప్పారు.



శ్రీస్వామివారి పూర్వాపరాలు పరిశీలిస్తే ప్రొద్దుటూరు ప్రక్కన శంకవరం అనే గ్రామానికి చెందిన యాదవ వంశములో జన్మించారు. చదువు లేదు. ఆయన అసలు పేరు కృష్ణయ్య. ఇసుక దోసిల్లు, దోసిల్లు తింటారు. కాబట్టి ఇసుక స్వామి అని పేరు వచ్చింది. ప్రొద్దుటూరులో ప్రతి రోజు ఉదయం హోటళ్ళు అన్ని తీసి శ్రీస్వామివారి రాక కోసం ఎదురు చూస్తుంటారట. ఆయన యే హోటల్లోనైనా ఇడ్లీగాని యింకేదైనా తిన్నారంటే ఆ హోటల్ వాళ్ళకు ఆ రోజు బ్రహ్మాండంగా వ్యాపారం జరుగుతుందట. కారులో ఎక్కి 10 కిలోమీటర్లు టౌనులోనే ఊరక ఆ బజారు, ఈ బజారు త్రిప్పుతారు. యేమి పని వుండదు. వెంటనే దిగి పోతారు. ఆ తరువాత కారు అతనికి ఆ రోజంతా బ్రహ్మాండంగా బాడుగ వుంటుంది. అట్లాగే సైకిల్ షాపులోకి వెళ్ళి బాడుగ సైకిల్ తీసుకొని వెళ్ళిపోతారు. తొక్కుకుంటూ వెళ్ళి దానిని ఏ వాగులోనో, కంపకర్ర చెట్ల పొదల్లోనో పడవేస్తారు. అయినా ఆ రోజు ఆ సైకిల్ షాపు అతనికి సైకిల్ ఖరీదు కంటే ఎన్నో రెట్లు వ్యాపారం జరుగుతుందట. తక్కువ పెట్రోల్ వుందని చెప్పిన వినకుండా కారు తీసుకొని సాయంత్రము వరకు ప్రయాణానికి కారును వుపయోగించి తిరిగి ప్రొద్దుటూరు వచ్చిన తరువాత పెట్రోల్ ఏమాత్రం తగ్గేది కాదు.

ఢిల్లీలో ఒక గురువుగారి దగ్గర ఒక శిష్యుడు వుండేవాడు. అతనికి లక్ష రూపాయలు ఎగ్గొటారు. ఎన్ని సార్లు అడిగిన యివ్వలేదు. ఆ గురువు గారు శిష్యునితో 'ఆంధ్రాలో ప్రొద్దుటూరులో శివాంశ సంభూతుడు అయిన అవధూత వున్నారు. ఆయనను దర్శిస్తే నీ సమస్య తీరుతుంది' అని చెప్పారు.

వెంటనే ప్రొద్దుటూరు వస్తానే అతనేమి చెప్పక ముందే చర్నాకోలతో శ్రీ స్వామివారు అతనిని 6 దెబ్బలు కొట్టారు. ఒక్కొక్క దెబ్బకు ఢిల్లీలో డబ్బులు ఎగ్గొట్టిన వ్యక్తి శరీరము మీద వాతలు పొంగుతున్నాయి. అతనికి మోచెయ్యి వరకు చెయ్యి తర్వాత చర్నాకోలు కన్పిస్తున్నాయి. వెంటనే అతను తెల్లవారి గురువుగారి వద్దకు వెళ్ళి విచారించి

ఆ శిష్యుడు ప్రొద్దుటూరులో వున్నారని తెలుసుకొని అక్కడికి వెళ్ళి ఆ శిష్యునికి డబ్బు చెల్లించాడు.

రాయలసీమలో ఫ్యాక్షనిజం ఎక్కువ. దొమ్మీలు, హత్యలు సర్వసాధారణం. అటువంటప్పుడు శ్రీ స్వామివారిని ఆశ్రయిస్తే ఆయన గోచికున్న ఒక దారం పోగు చేతికి కట్టి యింక వెళ్ళి పొమ్మంటారు. ఇంక ఎలాంటి ఘర్షణలు వుండవు. సాధారణంగా మన సమస్యలు శ్రీ స్వామివారికి చెప్పడము, ఆయన దానికి పరిష్కారము చెప్పడము వుండదు. మనం వెళ్ళిన వెంటనే క్రియా రూపంలో మన సమస్యను ఆయనే పరిష్కారం చేస్తారని శిష్యుల విశ్వాసం. శ్రీ స్వామివారు అందరిని కొట్టరు. అనుగ్రహించదలచిన వారిని మాత్రమే కొడతారు. ఎంతో మంది సినీ యాక్టర్లు, రాజకీయ నాయకులు శ్రీ స్వామివారి చేత కొట్టించుకుందామని ఎన్ని ప్రయత్నాలు చేసిన కొట్టరు.

శ్రీ స్వామివారు సంవత్సరానికి ఒకసారి శ్రీశైలం వెళ్తారు. ఆయనతో పాటు దాదాపు 10 మంది వుంటారు. అక్కడికి వెళ్ళిన తరువాత శ్రీ స్వామి వారు కీకారణ్యంలోకి వెళ్తారు. శిష్యులు కొంత దూరం వెంబడించి తిరిగి వెనక్కి వచ్చేస్తారు. తర్వాత పది రోజులకు శ్రీ స్వామివారు తిరిగి ప్రొద్దుటూరు వస్తారు. ఆ 10 రోజులు ఎక్కడుంటారో, ఏమి తింటారో, ఎట్లా వస్తారో దైవానికి ఎరుక.

తుమ్మూరి శేషారావు **RTC** కండక్టరు, నిడదవోలు.

నేను ప్రథమముగా శ్రీ స్వామివారి దర్శనము కొరకు 2005వ సంవత్సరము శ్రావణ శుక్రవారమున ప్రొద్దుటూరుకు వచ్చాము. శ్రీ స్వామివారు వచ్చు వరకు గురుగీత పారాయణ చేయుచున్నాను. సుమారు మధ్యాహ్నము 2గం. 30 నిమషములకు శ్రీ స్వామివారు తిరిగి వస్తూనే పో పో అని గద్దించినారు. వెంటనే అందరితోపాటు



బయటకు వచ్చి మరల గురుచరిత్ర పారాయణ చేస్తున్నాము. శ్రీస్వామి వారు మాకు అరటి పండ్లు ప్రసాదంగా పంపారు. శ్రీ స్వామివారు సాయంత్రము 4గం. 30ని. లకు బయటకు వచ్చి నీళ్ళ గొట్టముతో పూర్తిగా తడిపి ఆశీర్వాదించారు. కాని నాకు వారు పాద నమస్కారము ప్రసాదించలేదని అసంతృప్తిగా వుంది. నేను మేడపైకి వెళ్ళి ఆ యింటి యాజమాని శ్రీ ఓబులరెడ్డి గారిని కలిసాను. వారిని కొన్ని శ్రీ స్వామివారి లీలను చెప్పమని అడిగాను. వారీవిధంగా చెప్పారు.

శ్రీ స్వామివారు ప్రొద్దుటూరులో ఉన్నప్పుడు అప్పుడప్పుడు మా యింటికి వచ్చి, యింట్లో తిరుగుచూ కొంతసేపు ఉండి వెళ్ళేవారు. తరువాత కొంతకాలమునకు శ్రీ స్వామివారు శ్రీశైలము వెళ్ళిపోయారు. భక్తులు శ్రీ స్వామివారి దర్శనమునకు వచ్చి, శ్రీ స్వామివారు లేనందున నిరుత్సాహముతో తిరిగి వెళ్ళేవారు. ఇది గమనించి శ్రీఓబులరెడ్డి గారు వారి శ్రీమతితో, శ్రీ స్వామివారిని తిరిగి ప్రొద్దుటూరు తీసుకొస్తానని అన్నారు. అప్పుడు వారి శ్రీమతి శ్రీ స్వామివారిని తీసుకొని వచ్చిన తరువాత మన ఇంట్లో వుంచుకొని సేవ చెయ్యాలి కాని వారిని అలా వదలివేయకూడదని తన మనస్సులోని మాట భర్తతో చెప్పెను. దానికి సమ్మతించి ఇద్దరు కలిసి శ్రీశైలమునకు వెళ్ళి ఒక చెట్టు క్రింద కూర్చున్న శ్రీ స్వామివారికి సాష్టాంగ నమస్కారములు చేసి, శ్రీ స్వామివారిని తిరిగి ప్రొద్దుటూరు రావలసినదిగా వినమ్రులై ప్రార్థించారు. శ్రీ స్వామివారు ఏమియు మాటలాడలేదు. ఆ రోజు వారు శ్రీశైలములోనే ఉన్నారు. మరుసటి రోజు మరలా శ్రీ స్వామివారి వద్దకు వెళ్ళి ప్రొద్దుటూరు రావలసినదిగా కోరినారు. శ్రీ స్వామివారు టాటా సుమోతో ప్రదక్షిణ చేయవలసినదుగా సంజ్ఞచేసారు. ప్రదక్షిణ చేసిన వెంటనే శ్రీ స్వామి వారు సుమో ఎక్కి శ్రీశైలములో నిత్యమూ సేవ చేస్తున్న భక్తుని ఇంటికి వెళ్ళి, ఒక టవల్ అడిగి తీసుకొని అందులో బియ్యము పోయించుకొని

మూట కట్టి, ఒక కర్రకి తగిలించుకొని భుజంపై వేసుకొన్నారు. ఆ తరువాత ఆ రెడ్డిగారి దంపతులతో ప్రొద్దుటూరు తిరిగి చేరారు. శ్రీ రెడ్డిగారు తన భవనములో క్రింద పోర్షనులో బాడుగకు వుంటున్నవారిని ఖాళీ చేయిస్తాను, స్వామి మీరు అక్కడుండమని అడిగారు. శ్రీ స్వామివారి అంగీకారముతో ఇల్లు ఖాళీ చేయించి శ్రీ స్వామివారికి ఇచ్చాము.

శ్రీఓబులరెడ్డిగారి తల్లికి కిడ్నీలలో ప్రాబ్లమున్నదని హైదరాబాదు డాక్టర్లు పరీక్షలు చేసి కిడ్నీ మార్చాలని చెప్పారు. ప్రస్తుతము తాత్కాలికముగా మందులువాడి మరల తీసుకురమ్మని చెప్పారు. ఆ సమయంలో శ్రీ స్వామివారు వారింట్లోనే ఉంటున్నారు. శ్రీ స్వామివారు వారి తల్లిగారిని ఒక చెంబుతో మంచినీళ్ళు తీసుకరమ్మని చెప్పారు. శ్రీ స్వామివారు కొంచెము నీరు త్రాగి మిగిలిన నీరంతా తీర్థంగా ఆమె చేత త్రాగించారు. ప్రతి రోజు ఈవిధంగా జరుగుతూనే వుంది. శ్రీ స్వామివారి కృపతో కిడ్నీలు సరిగా పనిచేయుచున్నవి. మా అమ్మగారు ఎంతో ఆనందముగా తిరుగు చున్నారని వారి తల్లిగారిని పరిచయము చేసారు. నన్ను ఆ సందర్భములో శ్రీ స్వామివారికి పాద నమస్కారము చేసుకొన్నారా అని అడుగగానే లేదు అన్నాను. వెంటనే రెడ్డిగారు నాచే శ్రీ స్వామివారికి పాదనమస్కారము చేయించారు. శ్రీ స్వామి వారు ప్రసాదంగా వారు కట్టిన పంచె ఇచ్చారు. నా మనస్సులోని పాద నమస్కారము చేయలేదన్న కొరతను తీర్చి, ప్రసాదమిచ్చుట శ్రీ స్వామివారి సర్వజ్ఞత్వము మరయు శ్రీసాయినాథుని, భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి వారి ఆశీస్సుల ప్రభావమే. శ్రీ కృష్ణయ్యస్వామి వారు సాక్షాత్తు శ్రీదత్తావధూతగా నా హృదయ తరంగాలలో నిలిచిన మహాత్ములు.



నేను రెండవ పర్యాయము నాకుమార్తెతో కలిసి గొలగమూడి వెళ్ళి రెండు రోజులు భగవాన్ శ్రీ వెంకయ్య స్వామివారిని దర్శించుకొని, శ్రీ పెసల సుబ్బరామయ్య గారితో చెప్పి ప్రొద్దుటూరులో వున్న అవధూత శ్రీ కృష్ణయ్యస్వామి వారి దర్శనమునకు వెళ్ళాము. సుమారు రాత్రి 9గం. 30 ని. శ్రీ స్వామివారి సన్నిధికి చేరాము. వారి సేవకులు ఇప్పుడు దర్శనము లేదు, రేపు ఉదయము రమ్మన్నారు. ఆ సమయములో వర్షము వస్తుంది. చేయుటకు ఏమితోచక బస్టాండ్‌కు వెళ్ళి రాత్రి అక్కడ గడిపి ఉదయమునకు రావచ్చునని 200 మీటర్ల దూరంలోనున్న రిక్షాస్టాండుకు చేరాము. అదే సమయములో శ్రీ ఓబులురెడ్డిగారు కారులో నుంచి దిగుట చూచి, నేను నా కుమార్తె వారి వద్దకు వెళ్ళాము. ఇంతకు మునుపు వచ్చినందువలన నన్ను గుర్తు పట్టి శ్రీ స్వామివారున్న గది ప్రక్కన నిద్రించుటకు అనుమతినిచ్చి నీళ్ళబాటిల్ మరియు దోమలు పోవుటకు జెట్ యిచ్చారు. మేము ఉదయము శ్రీ స్వామివారికి పూజచేసి, పండ్లు, పూలమాల, బట్టలు సమర్పించాము. ఫోటోలు తీయుంచుటకు ఫోటగ్రాఫర్‌ను తీసుకు వచ్చాను. శ్రీ స్వామివారు ఒక్కసారిగా గద్దించినారు. ఫోటోగ్రాఫర్ ప్రక్కకు వెళ్ళాడు. నేను శ్రీసాయి నామస్మరణచేస్తూ, శ్రీ స్వామి వారిని ఫోటో తీయుంచుటకు అనుమతినిమ్మని మనస్సులో ప్రార్థన చేయగా శ్రీ స్వామివారే ఫోటోగ్రాఫర్‌ను పిలిచి అభయ హస్తముతో ఫోటో తీయమన్నారు. వెంటనే ఫోటోలు తీసాము. శ్రీ స్వామివారు దోసిలితో 3 సార్లు ఇసుకను నా కుమార్తె చున్నిలో పోశారు. నన్ను నాకుమార్తెను సాయి భవాని అని పిలిచి శ్రీ స్వామివారు స్వయముగా ప్రసాదమిచ్చారు. ఇంటికి వచ్చి ఇసుకను బేసిన్‌లో పోయగా బేసిన్ పూర్తిగా నిండినది. ఇది మాకు గొప్ప అద్భుత లీల.

రామాంజనేయులు, శంకరావరం తను విన్న లీలను గురించి ఇలా చెప్పారు. మేము శ్రీ స్వామివారిని శంకరావరములో నున్నపప్పుడు

మామయ్య అని పిలిచే వాళ్ళము. ఇక్కడి (ప్రొద్దుటూరు)కి వచ్చిన తరువాత అందరూ స్వామి అని పిలుస్తున్నారు.

మా వూరిలోని శ్రీ చంద్రారెడ్డిగారు సేద్యానికి వెళ్ళుతూ తన భార్యతో మధ్యాహ్నానికి భోజనమునకు రాగి సంగటి, మునగ కాయల కూర చేసి పొలానికి పంపు అని చెప్పారు. ఆమె అదేవిధంగా తయారుచేసి ఒక గంపలో పెట్టి శ్రీ స్వామివారి ద్వారా పంపెను. శ్రీ స్వామివారు తలపై గంపను పెట్టుకొని కులుకుతూ వెళ్ళారు. మాలోనికుంట సత్రము వద్ద ఆగి, గంపలోని మొత్తము రాగి సంగటి, మునగకాయల కూర పూర్తిగా తిని ఖాళీ చేసెను. ఖాళీ గంపను నెత్తిన పెట్టుకొని పొలమునకు వెళ్ళెను. పొలము వద్ద దింపిన గంపలో అన్నము, పప్పు వుంది. చంద్రారెడ్డి గారు భోజనము చేసి, యింటికి వచ్చి భార్య తన మాట వినలేదని తిట్టి కొట్టారు. ఆమె మనస్సులో శ్రీ స్వామివారిని తిట్టుకుంటూ తను రాగి సంగటి, మునగ కాయల కూరే చేసి శ్రీ స్వామివారి ద్వారా పంపానని నిరూపించేందుకు ఆ వంటలు వండిన పాత్రలు చూపెను. ఆ తరువాత శ్రీ స్వామివారు పెన్నానదికి వెళ్ళి ఇసుకను తింటుండేవారు. ఇలాంటి లీలల ద్వారా శ్రీ స్వామివారి మహిమ బహిర్గతమయ్యేను.

ఒకమారు శ్రీ సుంకు సుబ్బారావు గారు హైకోర్టులో విచారణ జరుగుచున్న కేసు గురించి వెళుతూ, శ్రీ స్వామివారిని తీసుకొని వెళితే శ్రీ స్వామివారి కృపతో కేసు గెలువ వచ్చని తనతో హైదరాబాద్‌కు రమ్మని అడిగారు. శ్రీ స్వామివారు రానని చెప్పారు. ఆ సమయములో శ్రీ స్వామివారు ప్రొద్దుటూరులోనేవున్నారు కానీ హైదరాబాద్‌కు చేరిన సుబ్బారావుకు శ్రీ స్వామివారు ఎదురు వచ్చారు. ఈ విధంగా శ్రీ స్వామివారు ఒకే సమయములో అనేక చోట్ల ప్రకట మయ్యారు.



శ్రీ నాగరాజు, ప్రొద్దుటూరు ఇలా చెపుతున్నారు.

నేను **BSNL** ఆఫీసులో పని చేయుచున్నాను. అప్పుడప్పుడు వచ్చి శ్రీ స్వామివారిని దర్శించుకుని వెళుతాను. నాకు 6 నెలల వయస్సప్పుడు శ్రీ స్వామి వారు మాయింటికి వచ్చారు. అప్పటి నుంచి అప్పుడప్పుడు మాయింటికి వచ్చేవారు. నాకు శ్రీ స్వామి వారన్నా లేక దైవము, భక్తి అన్నా పట్టేదికాదు. ఒక రోజు కలలో శ్రీ స్వామి వారు కన్పించారు. ఆ మరుసటి ఉదయాన్నే వచ్చి శ్రీ స్వామి వారిని దర్శించుకొన్నాను. అప్పటి నుంచి నా ప్రవర్తనలో మార్పు వచ్చినది. అంతకమునుపు ఇంటిలోని వారిని తిట్టి కొట్టె వాడ్ని, ఇప్పుడు శాంతముగా ఉండగలుగుచున్నాను. కోపం ఎక్కువ వచ్చిన మాట్లాడటము తప్ప ఇంకేమి చెయ్యను. నేనంత తెలివి గలవాడ్ని కానప్పటికి శ్రీ స్వామి వారి కృపవలననే నాకు **BSNL** లో ఉద్యోగము వచ్చినది. నా పుట్టిన రోజున శ్రీ స్వామి వారి ఆశీస్సులు కొరకు ఉదయాన్నే వారుంటున్న ఇంటికి రాగా శ్రీ స్వామి వారు అప్పటికే ఇంటినుంచి వెళ్ళి పోయారు. ఆ రోజంతా శ్రీ స్వామి వారి దర్శనము గురించిన ఆలోచనలతోనే గడిచినది. కాని దర్శనము కాలేదు. నేను తిరిగి ఇంటికి వెళ్ళేందుకు బస్టాండ్‌కు పోగా బస్సుకూడా వెళ్ళిపోయినది. రోడ్డులో నిలబడి వచ్చే కార్లలో ఏదో ఒకటి ఆపి లిఫ్ట్ అడిగి వెళ్ళాలని ఒక కారును ఆపాను. అందులో శ్రీ స్వామి వారు ఉన్నారు. శ్రీ స్వామి వారు నన్ను ఆశీర్వదించారు. కారు వెళ్ళి పోయినది. తిరిగి కారువైపు చూడగ దాదాపు 2 కి.మి. నేరుగా నున్న రోడ్డులో కారె కన్పించలేదు. ఈవిధంగా శ్రీ స్వామి వారు నా మనస్సు నందలి కోరిక ప్రకారము దర్శన ఆశీస్సులిచ్చి కారుతో సహా అదృశ్యమయ్యారు.

ఒక మారు శ్రీ స్వామి వారున్న ఇంటి ముందు భక్తులందరూ శ్రీ స్వామి వారి అనుగ్రహము కొరకు వున్నారు. నేను ఆచ్చటనే

వున్నా, శ్రీ స్వామివారు నన్ను కూడా కొట్టితే బాగుంటుందని అనుకొంటూండగా శ్రీ స్వామి వారు వెనుక నుంచి కాలుతో ఒక తన్ను తన్నారు. వెను తిరిగి చూచుకుంటే అక్కడలేరు కాని ఎదురుగ నున్న ఇంటిలోనున్నారు. ఆ క్షణమున తన్నడము అదే క్షణములో 20 మీటర్లు దూరమునున్న ఇంటిలో వుండడమే ఆశ్చర్యము కలిగించింది. శ్రీ స్వామి వారే మనమేమి కోరకనే మనకి అవసరమైనదంతా చేస్తున్నారని చెప్పారు.

ఎర్రగుంట్ల కాలనీలో వుంటున్న కవిత గారి అనుభవము.

ఈమె ఆరోగ్యము బాగలేనందున ఈమెను హైదరాబాద్, తిరుపతి, చెన్నై ఆసుపత్రులకు తీసుకెళ్ళి ట్రీట్మెంట్ ఇప్పించారు. కొన్ని లక్షల రూపాయలు ఖర్చు పెట్టారు. కొద్దిగా కూడా నయమవలేదు. చివరికి డాక్టర్లు బ్లడ్ కాన్సర్ అని నిర్ధారించి, ఎక్కువకాలము బ్రతకదు. ఇంటికి తీసుకెళ్ళి ఆమె చివరి కోరికలు తీర్చమన్నారు. ఆమె ఇంటి దగ్గరనున్న ఒక భక్తుడు ప్రొద్దుటూరులో నున్న శ్రీ కృష్ణయ్య స్వామి దగ్గరకు తీసుకెళ్ళినచో బాగుండునని చెప్పెను. ఒక రోజు ఉదయము శ్రీ స్వామి వారి దర్శనమునకు వచ్చారు. బయట నిలబడి వున్న ఆమెను చూచి ఎవరు ఏమీ చెప్పక ముందే శ్రీ స్వామి వారు వంగి ఆమె పొట్టపై తన తలనుంచి గుండ్రముగా త్రిప్పారు. దానితో ఆమె ఆరోగ్యము బాగైనది. తిరిగి చెకప్‌కు వెళ్ళగా చెకప్ చేసిన డాక్టర్ల ఆశ్చర్యమునకు అంతులేదు. కారణం చెకప్ రిపోర్టులో బ్లడ్ కాన్సర్ సింపటమ్స్ (ఆనమాలు) లేవు. ఇది అనంత కరుణామయుడైన శ్రీ స్వామి వారి కృప మరియు అనుగ్రహము కాక మరేమి కాదన్నారు.

**D.** వెంకటరెడ్డి, లాయర్, లింగారెడ్డి బజార్, ప్రొద్దుటూరు

2002 వ సంవత్సరమున మా ఇంటిలోని ఎద్దు తొడలలో పొడిచినది. ఆసుపత్రికి తీసుకుని వెళ్ళారు. డాక్టర్లు ఆపరేషన్ చేయబోయె



ముందుగానే చెప్పారు ఏమీ చెప్పలేమని. వాళ్లు ఆపరేషన్ చేశారు కాని నేను శ్రీ స్వామి వారినే నమ్ముకొన్నాను. ఆపరేషన్ వల్ల ఏమీ కాలేదు. నడవలేక మంచములోనే ఉండేవాడ్ని. శ్రీ స్వామి వారు మూడు సంవత్సరముల నుంచి పైపుతో నీళ్ళు పట్టి వళ్ళంతా రుద్దారు. రుద్దించారు. దానితో ఎప్పటినుంచో పట్టుకొని పోయిన నరాలన్నీ కదిలాయి. దానితో ఆరోగ్యము బాగైనది. నడవగలుగు చున్నాను. ఇదంతా పరబ్రహ్మమూర్తి అయిన శ్రీ స్వామి వారి కృప.

కాటరాక్ట్ ఆపరేషన్ చేయించుకొన్న తరువాత శ్రీ స్వామి వారి దగ్గరకు పోవద్దు ఆయన నీళ్లు పట్టితే కళ్ళలో పడిన కళ్ళు పోతాయి పోవద్దన్నా ప్రతి రోజు ఉదయాన్నే వచ్చి శ్రీ స్వామి వారిని దర్శించుకుని వెళతాను. ఒక వేళ నేను దర్శనమునకు రాలేకపోతే శ్రీ స్వామి వారే మా ఇంటి వద్దకు వచ్చి దర్శనమిస్తారు.

నేను తిరుపతి శ్రీవేంకటేశ్వరుని దర్శనానికి వెళితే అక్కడ ముందుగా శ్రీ స్వామి వారు దర్శనమిచ్చారు. శ్రీ స్వామి వారు ఒకమారు కలలో కన్పించి దేవలోకం అంతా చూపారు. అక్కడ శ్రీకృష్ణుడు, ఆయన వద్ద రుక్మిణిదేవి, సత్యభామ చేతులలో పళ్ళాలు పట్టుకోని నిలడ్డారు. ఇంకొక మారు కలలో ఎర్రబట్టలతో నున్న శ్రీరామ చంద్రుడిని చూపారు.

శ్రీ స్వామి వారి దగ్గరకు వచ్చిన వారి లోనున్న హృదయమును గమనించి వారి కోరికలు తీరుస్తున్నారన్నారు.

**CH.** దశరథరామి రెడ్డి, దువ్వూరివారి పాలెం, ముత్తుకూరు మండలం, నెల్లూరు జిల్లా.

ఒకమారు వీరు చాలా క్లిష్టపరిస్థితులలో నున్నప్పుడు పుట్టపర్తిలో నున్న శ్రీ సత్యసాయిబాబాను దర్శించుకొని, తన బాధనంతా

మనస్సులోనే బాబాకు చెప్పుకొన్నారు. ప్రక్కనేవున్న మిత్రుడు ప్రొద్దుటూరులో శ్రీ కృష్ణయ్య స్వామి వారున్నారు గొప్ప అవధూత, దర్శించుకుంటే బాగుంటుందని చెప్పారు. వారి సలహా ప్రకారము శ్రీ స్వామి వారి దర్శనమునకు ప్రొద్దుటూరుకు వెళ్ళాను.

ఉదయాన్నే శ్రీ స్వామి వారు ఇంటి బయట నీళ్ళపైపుతో దర్శనమునకు వచ్చిన భక్తులను నీళ్ళతో తడపడము, ఇసుకను మోయించడము కార్యక్రమములో నున్నారు. శ్రీ స్వామి వారు నన్ను చూచి, దా దా అని పిలిచారు. దగ్గరకు వెళ్ళగానే పంచె విప్పమన్నారు. శ్రీ స్వామి వారు చెప్పారు కదా అని విప్పాను. విప్పిన పంచెను శ్రీ స్వామి వారికి కట్టమని అడుగగా ఆ పంచెను శ్రీ స్వామి వారికి కట్టాను. శ్రీ స్వామి వారు వేరే పంచెను ఇచ్చి నన్ను కట్టుకొమన్నారు. ఈ సంఘటన ద్వారా శ్రీ స్వామి వారు నా బరువు, బాధ్యతలను వహిస్తారని నాకు అన్పించినది.

శ్రీ స్వామి వారు నాకు పంచెను ఇచ్చారు, దీనికి పూజ చేయుటకు కుదరటము లేదు. శ్రీ స్వామి వారు పూజించుకొనేందుకు వీలుగ ఉండేదేమైనా ఇస్తే బాగుండునని అనుకొనుచుండగా ఇసుక దిబ్బలో నుంచి ఒక నాపరాయి ముక్క తీసిచ్చారు. దీనికి మాయింటిలో అభిషేకించి పూజ చేసుకుంటున్నాము.

4 సంవత్సరముల నుంచి ప్రతి సంవత్సరము 25వేల రూపాయల ప్రీమియంతో మా అబ్బాయి పేరుతో కట్టుతూ వచ్చాను. 5 దవ సంవత్సరము నాకు విపరీతమైన కష్టాలు వచ్చి 2, 3 లక్షల రూపాయలు నష్ఠపోయాను. ప్రీమియము కూడా కట్టలేని పరిస్థితిలో నున్నాను. ఆసమయములో శ్రీ స్వామి వారు నాకు కలలో కన్పించి మా అబ్బాయికి మంచి ఉద్యోగము వస్తుందని చెప్పారు. ఆవిధంగానే



నా కుమారునికి తిరుపతిలో మంచి ఉద్యోగము వచ్చినది. ఇప్పుడు నా కుమారుడు తన ప్రీమియమును కట్టుకోవడమే గాక ఇంటి బాధ్యతలను కూడా స్వీకరించాడు. ఈవిధంగా సమయానికి ఆదుకున్న ఆ మహనీయమూర్తిని తరుచుగా వచ్చి దర్శించుకుంటున్నాను, ఆయనకు ఏమిచ్చి కృతజ్ఞతలు తెలుపుకోగలను?

శ్రీ సుబ్బారాయుడు వారి శ్రీమతి ఈశ్వరమ్మ, ప్రొద్దుటూరు.

ప్రస్తుతము వీరు ఇల్లు, సంసారము వదలి శ్రీ స్వామివారి సేవలో వుంటున్నారు. వీరింటికి శ్రీ స్వామివారు 32 సంవత్సరముల క్రితము వచ్చారు. అప్పట్లో శ్రీ స్వామివారిని గురించి అంతగా పట్టించుకొనలేదు. మేము ఒకసారి ఇంటి స్థలము కొనవలెనని శ్రీ స్వామివారిని అడుగగా వద్దని చెప్పారు. అయినా ఆ స్థలము కొని నష్ట పోయాము. 16 సంవత్సరముల తరువాత మరల మాయింటికి వచ్చారు. మా దుకాణంలోని వస్తువులన్నీ తీసి విసిరి బయట పారేసారు. అప్పటినుంచి వ్యాపారము మానుకొని శ్రీ స్వామివారి సేవ చేసుకొంటున్నాము. శ్రీ స్వామివారి లీలలను ఈవిధంగా వివరించారు.

శ్రీ స్వామివారు గత 8 నెలలనించి మూటలు మూటలుగా పసుపు, కుంకుమ పూయించు కుంటున్నారు. ఇంకా గుంటలు తీయించి అందులోనూ పసుపు, కుంకమ నీళ్ళు పోయిస్తున్నారు.

శ్రీ స్వామివారు ఒకే సమయములో అనేకచోట్ల దర్శనమిస్తున్నారు.

వీరెక్కిన కారు, బస్సు, లారీ, ఆటో ఎంత దూరము ప్రయాణం చేసినా ఒక్క బొట్టు డీజల్ (ఆయిల్) ఖర్చు కాదు.

ఒకమారు శ్రీ స్వామివారు నీళ్ళు తెప్పించి, తాను కొద్దిగా త్రాగి మిగిలిన నీళ్ళును డీజల్‌కు బదులుగా జీపు డీజల్ ట్యాంకులో పోయించి నడిపించారు.

శ్రీ స్వామివారు బట్టలు విప్పి ఎవరిమీదైతే వేస్తారో, లేక ఒక రాయి గాని, కఱ్ఱ గాని, ఇసుకగాని ఇస్తే వాళ్ళకి చాలా మేలు జరుగుతుంది.

శ్రీ స్వామివారు చేతితోగాని లేక కఱ్ఱతోగాని కొట్టిన వాళ్ళ బాధలన్నీ తీరిపోతాయి. శ్రీ స్వామివారిని మనమేమి అడుగనే మన మనస్సులోని కోరికలను తీరుస్తున్నారు.

ఈశ్వరమ్మ గారు చెప్పిన కొన్ని శ్రీ స్వామివారి లీలలు.

ఒక రాజకీయ నాయకుడు వచ్చి శ్రీ స్వామివారిని దర్శించుకొనగా, శ్రీ స్వామివారు అతనిని చూచి, తొడగొట్టి, మీసములు మెలితిప్పారు. దానితో ఏటూ ఓడిపోయేది ఖాయమని నిర్ణయించుకొనిన ఆ రాజకీయ నాయకుడు ఎలక్షన్‌లో గెలిచారు.

కోటీశ్వరుడైన శ్రీ కొండారెడ్డిగారి భార్య తన భర్తతో శ్రీ స్వామివారి దర్శనమునకు వచ్చెను. ఆమెకు శ్రీ స్వామివారు ఒక పాత చినిగి పోయిన గుడ్డను యిచ్చారు. దానిని తీసుకొని ఇంటికి పోయిన తరువాత భర్త దానిని అసహ్యంచుకొని పారవేశాడు. అప్పటినుంచి కష్టాలు మొదలై ఆస్తి అంతా ఆరతి ఖర్పూరంగా ఖర్చు అయిపోయినది. వ్యాపారాలన్నీ నష్టాలు పాలై, ప్రొద్దుటూరులో నున్న స్థిరాస్తులను చాలా తక్కువ ధరకమ్మి మానసిక స్థిరత లేక తిరుపతి కెళ్ళారు. వారి పెద్దబ్బాయి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకొన్నాడు. వారి శ్రీమతి ఎక్కడున్నదో తెలియదు.

శ్రీ దస్తగిరి, శ్రీనివాసనగర్, ప్రొద్దుటూరు వారి శ్రీమతి ఈ విధంగా చెప్పారు.

శ్రీ స్వామివారిని దర్శించు కొన్నప్పుడు మన మనస్సులో ఏమనుకుంటే అవన్నీ అయిపోతాయి. మొదటిది మనకు శ్రీ స్వామివారి మీద మనకు నమ్మకం లేక విశ్వాసం వుండాలి. ఆయనే మనకన్నీ



తెలియ పరుస్తారు. వారి వెంబడే వుండబట్టి వారి మాటలు, చేతలు గమనించి ఈయన భగవంతుడని నమ్మాము. మాకు సర్వమూ ఆయనే, ఆయనే మాకవసరమైనవన్నీ చేస్తున్నారు. మావారి రూపంలేకుండా శ్రీ స్వామివారు వుండటము. ఒక మారు మేమిరువురము వేరే వూరికి వెళ్ళి ఒకచోటే పడుకున్నాము. అప్పుడు మావారికి బదులుగా శ్రీ స్వామివారు దర్శనమిచ్చారు. మాపాపకి కోరుకున్న ఇంజనీరింగ్ సీటు ఇప్పించారు. ఇప్పుడు శ్రీ స్వామివారి కృపవలన తిరుపతిలో ఉద్యోగం వచ్చింది. ప్రస్తుతము మేము మా అమ్మాయి దగ్గర వుంటున్నాము. తిరుపతి నుంచి శ్రీ స్వామివారి దర్శనమునకు వచ్చాము. ఇక్కడ ఉన్నప్పుడు తెల్లవారి 3, 4 గంటలనుంచి రాత్రి వరకు శ్రీ స్వామివారి సేవలోనే ఉండేవాళ్ళము.

## ఓం శ్రీ సాయినాథస్వరూప అవధూత క్రిష్ణయ్య స్వామి అష్టోత్తర శతనామవళి

1. ఓం శ్రీసాయినాథ స్వరూపాయ నమః 2. ఓం శ్రీ క్రిష్ణయ్య స్వామినే నమః 3. ఓం శ్రీ శంకరాపుర జన్మస్థలాయ నమః 4. ఓం శ్రీ లక్ష్మమ్మ, సాధు కొండయ్య తనయాయ నమః 5. ఓం శ్రీ ప్రొద్దుటూరు నివాసాయ నమః 6. ఓం శ్రీ అవధూతాయ నమః 7. ఓం శ్రీ దిగంబరాయ నమః 8. ఓం శ్రీ మహాయోగినే నమః 9. ఓం శ్రీ తపస్వినే నమః 10. ఓం శ్రీ జ్ఞానినే నమః 11. ఓం శ్రీ జలక్రీడా విలాసాయ నమః 12. ఓం శ్రీ యాదవ కులోత్తమాయ నమః 13. ఓం శ్రీ గోకుల క్రిష్ణయ్య నమః 14. ఓం శ్రీ వస్త్ర వివర్జితాయ నమః 15. ఓం శ్రీ సర్వవాహనాధి రూఢాయ నమః 16. ఓం శ్రీ సైకత క్రీడాయ నమః 17. ఓం శ్రీ స్వేచ్ఛ విహారినే నమః 18. ఓం శ్రీ కల్ప వృక్షాయ నమః 19. ఓం శ్రీ లోక సంరక్షకాయ నమః 20. ఓం శ్రీ స్వప్నదర్శనాయ నమః 21. ఓం శ్రీ అనాథ రక్షకాయ నమః 22. ఓం శ్రీ సర్వరోగ

నివారణాయ నమః 23. ఓం శ్రీ ఆరోగ్య ప్రదాతాయ నమః 24. ఓం శ్రీ ఐశ్వర్యప్రదాతాయ నమః 25. ఓం శ్రీ పరబ్రహ్మ స్వరూపిణే నమః 26. ఓం శ్రీ యోగక్షేమదాయకాయ నమః 27. ఓం శ్రీ అష్టఐశ్వర్య ప్రదాతాయ నమః 28. ఓం శ్రీ సర్వ జీవ ప్రేమాయ నమః 29. ఓం శ్రీ క్షేమ మార్గాయ నమః 30. ఓం శ్రీ మార్గ బంధవే నమః 31. ఓం శ్రీ భక్త రక్షకాయ నమః 32. ఓం శ్రీ సకల దేవతా స్వరూపాయ నమః 33. ఓం శ్రీ దివ్య మంగళ స్వరూపాయ నమః 34. ఓం శ్రీ సూర్యకోటి సమ ప్రభాయ నమః 35. ఓం శ్రీ నానాస్త్రధారయ నమః 36. ఓం శ్రీ వస్త్ర ప్రదాతాయ నమః 37. ఓం శ్రీ సర్వమంగళకరాయ నమః 38. ఓం శ్రీ అమృత వాక్యాయ నమః 39. ఓం శ్రీ అమృత గానాయ నమః 40. ఓం శ్రీ త్రికాలజ్ఞాన సంపన్నాయ నమః 41. ఓం శ్రీ సంతాన ప్రసాదాయ నమః 42. ఓం శ్రీ దివ్య దర్శనాయ నమః 43. ఓం శ్రీ సర్వమత సమ్మతాయ నమః 44. ఓం శ్రీ అనాధ దీన భాందవాయ నమః 45. ఓం శ్రీ కష్టనష్ట నివారణాయ నమః 46. ఓం శ్రీ సైకత స్వామినే నమః 47. ఓం శ్రీ సర్వాభీష్ట ప్రదాయ నమః 48. ఓం శ్రీ పరబ్రహ్మణే నమః 49. ఓం శ్రీ చిద్విలాసాయ నమః 50. ఓం శ్రీ శరణాగత వత్సలాయ నమః 51. ఓం శ్రీ రామకృష్ణాయ నమః 52. ఓం శ్రీ మంగళదాయకాయ నమః 53. ఓం శ్రీ కరుణామూర్తయే నమః 54. ఓం శ్రీ భక్త వత్సలాయ నమః 55. ఓం శ్రీ సర్వాంతర్యామినే నమః 56. ఓం శ్రీ దయ సాగరాయ నమః 57. ఓం శ్రీ దయార్థ్ర హృదయాయ నమః 58. ఓం శ్రీ భక్త హృదయాయ నమః 59. ఓం శ్రీ లోక నాథాయ నమః 60. ఓం శ్రీ సర్వ శక్తి మూర్తియే నమః 61.ఓం శ్రీ జీవధారాయ నమః 62.ఓం శ్రీ భూత భవిష్యత్‌వర్తమానాయ నమః 63. ఓం శ్రీ ఐశ్వర్య ప్రదాయ నమః 64.ఓం శ్రీ ప్రేమ సాగరాయ నమః 65.ఓం శ్రీ దివ్య స్వరూపాయ నమః 66. ఓం శ్రీ దయాగుణాయ నమః 67. ఓం శ్రీ ఆనంద నిలయాయ నమః 68. ఓం శ్రీ ప్రత్యక్ష దైవాయ నమః 69. ఓం శ్రీఅనుగ్రహ ప్రదాయ నమః 70. ఓం శ్రీ ముక్తి మార్గాయ నమః



71. ఓం శ్రీ అద్భుతానంద చర్యాయ నమః 72. ఓం శ్రీ సంసార సర్వ దుఃఖ క్షేమాయ నమః 73. ఓం శ్రీ సుందర రూపాయ నమః 74. ఓం శ్రీ ముక్తి ప్రదాయ నమః 75. ఓం శ్రీ అపరాజితాయ నమః 76.ఓం శ్రీ దివ్యకాంతాయ నమః 77. ఓం శ్రీ అమృతానంద తుల్యాయ నమః 78.ఓం శ్రీ ప్రేమ మూర్తియే నమః 79. ఓం శ్రీ దత్తాత్రేయాయ నమః 80.ఓం శ్రీ అఖిలాండ కోటి బ్రహ్మాండనాయకాయ నమః 81. ఓం శ్రీ ఓంకారాయ నమః 82. ఓం శ్రీ శక్తియే నమః 83. ఓం శ్రీ విద్యా ప్రసాదాయ నమః 84. ఓం శ్రీ దివ్య దృష్టాయ నమః 85. ఓం శ్రీ మృత్యంజయాయ నమః 86. ఓం శ్రీ స్వరూపానందాయ నమః 87. ఓం శ్రీ సులభ ప్రసన్నాయనే నమః 88. ఓం శ్రీ క్రిష్ణసాయి నమః 89. ఓం శ్రీ త్రిమూర్తి స్వరూపాయ నమః 90.ఓం శ్రీ పాప హరణాయ నమః 91. ఓం శ్రీ కృష్ణాయ నమః 92.ఓం శ్రీ కాలజ్ఞానినే నమః 93.ఓం శ్రీ సమర్థ సద్గురువే నమః 94. ఓం శ్రీ భక్త ఆనందాయ నమః 95. ఓం శ్రీ అంతర్యామినే నమః 96. ఓం శ్రీ అబేధానందాను భవ ప్రదాయ నమః 97. ఓం శ్రీ ఆపద్బాంధవాయ నమః 98. ఓం శ్రీ సర్వ మంగళదాయకాయ నమః 99. ఓం శ్రీ శరణాగతాయ నమః 100. ఓం శ్రీ పద్మమలాధారాయ నమః 101. ఓం శ్రీ శివాత్మకాయ నమః 102. ఓం శ్రీ అద్వైతానంద చర్యాయ నమః 103. ఓం శ్రీ ఆనందదాయకాయ నమః 104.ఓం శ్రీ యోగ క్షేమాయ నమః 105. ఓం శ్రీ గంగా తీర్థాయ నమః 106. ఓం శ్రీ సమర్థ సద్గురు క్రిష్ణనాథాయ నమః 107. ఓం శ్రీ సచ్చిదానంద స్వరూపాయ నమః 108. ఓం శ్రీ సమర్థ సద్గురు క్రిష్ణయ్య స్వామినే నమః

ప్రతులకు వ్రాయండి:-

శ్రీ సాయి మాష్టర్ సేవా ట్రస్టు,

గొలగమూడి, నెల్లూరు జిల్లా 524 321.

## మా ఇతర ప్రచురణలు

| | | |
|---|---|---|
| 1. | వార్తా లాపము | 150 రూ\|\| |
| 2. | అవధూత లీల - అరవం | 50 రూ\|\| |
| 3. | శ్రీ వెంకయ్య స్వామి - అరవం, చిన్న పుస్తకం | 5 రూ\|\| |
| 4. | అవధూత లీల - శ్రీ వెంకయ్య స్వామి వారి చరిత్ర నిత్య పారాయణ గ్రంథము, తెలుగు | 40 రూ\|\| |
| 5. | అవధూత లీల - ఇంగ్లీషు | 30 రూ\|\| |
| 6. | శ్రీ వెంకయ్య స్వామి - ఇంగ్లీషు, చిన్న పుస్తకం | 5 రూ\|\| |
| 7. | శ్రీ ధునీవాలా దాదా చరిత్ర | 15 రూ\|\| |
| 8. | అవధూత బోధామృతము - శ్రీ స్వామి వారి బోధలు | 15 రూ\|\| |
| 9. | శ్రీ స్వామి సన్నిధి - శ్రీ స్వామివారి సేవకుల అనుభవాలు | 15 రూ\|\| |
| 10. | శ్రీ శివనేశన్ స్వామీజీ దివ్య చరితము | 12 రూ\|\| |
| 11. | శ్రీ బూర్లె రంగన్న బాబుగారి దివ్య చరిత్ర | 8 రూ\|\| |
| 12. | గురుస్తుతి | 7 రూ\|\| |
| 13. | మంత్రమెక్కడుంది! తంత్రమెక్కడుంది! శ్రీ మాధవదాసు గారి దివ్య చరిత్ర | 4 రూ\|\| |
| 14. | శ్రీ పూండి స్వామి వారి దివ్య చరిత్ర | 2 రూ\|\| |
| 15. | మౌన బోధ | 1 రూ\|\| |
| 16. | పిలచిన పలికే దైవం | 1 రూ\|\| |
| 17. | ధర్మమూర్తి | 1 రూ\|\| |
| 18. | బోధ యజ్ఞాయ నమః | 1 రూ\|\| |
| 19. | దివ్య లీలలు | 1 రూ\|\| |
| 20. | శ్రీ వెంకయ్య స్వామి వారి పూజ | 1 రూ\|\| |
| 21. | శ్రీ స్వామి కృప | 1 రూ\|\| |
| 22. | శ్రీ స్వామి వారి భజన పాటలు | 1 రూ\|\| |
| 23. | నమ్మలేని పచ్చిసత్యాలు | 1 రూ\|\| |
| 24. | వెన్నెల పూలు - శ్రీ వెంకయ్య స్వామి దివ్యత్వం | 1 రూ\|\| |
| 25. | శ్రీ కృష్ణయ్య స్వామి దివ్య చరిత్ర, ప్రొద్దుటూరు | |
| 26. | నెల్లూరు శ్రీ యర్ర దర్గా స్వామివారి దివ్య చరిత్ర (శ్రీ సయ్యద్ అహ్మద్ బాబా గారి దివ్య చరిత్ర) | |
| 27. | ఆచార్య భరద్వాజ గారి సత్‌సంగము | ఉచితము |
| 28. | శ్రీ మాష్టారి మంచిమాట - శ్రీ E.భరద్వాజ గారి దివ్యవాణి | ఉచితము |
| 29. | శ్రీ భరద్వాజ గారితో భక్తుల అనుభవాలు | ఉచితము |
| 30. | శ్రీ జ్ఞానేశ్వర్ మహరాజ్ చరిత్ర | ఉచితము |
| 31. | మృత్యువు పై ఘనవిజయము | ఉచితము |
| 32. | మన ధర్మము - కర్తవ్యము | ఉచితము |
| 33. | శ్రీశ్రీశ్రీ సుధీంద్ర బాబు గారు | ఉచితము |
| 34. | స్మృతిమాత్ర ప్రసన్నాయ నమః | ఉచితము |
| 35. | స్మృతిరహిత ప్రసన్నాయ నమః | ఉచితము |
| 36. | శుద్ధ చైతన్యమే తానైన పూజ్య శ్రీ భరద్వాజ మాష్టార్ గారు | ఉచితము |
| 37. | అమృత వాక్కులు | ఉచితము |
| 38. | సర్వ సమర్థుడు | ఉచితము |
| 39. | భగవాన్ శ్రీ వెంకయ్య స్వామి(హిందీ) | ఉచితము |
| 40. | జ్ఞానేశ్వరి భగవద్గీత | 210 రూ\|\| |

Please visit ☞ www.saimastersevatrust.org